## క్లుప్తంగా

### 6న సందీప్ శర్మ అష్టావధానం



విజయవాడకల్చరల్: శ్రీ సద్గురు సంగీత సభ ఆధ్వర్యంలో సాహితీ సమార్చన కార్యక్రమంలో భాగంగా ఈ నెల 6వ తేదీ ఆదివారం సాయంత్రం శివరామకృష్ణ క్షేత్రంలో డాక్టర్ తాతా సందీప్ శర్మచే అష్టావధాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు సంస్థ కార్యదర్శి పోపూరి గౌరీనాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని మల్లాప్రగడ శ్రీమన్నారాయణ మూర్తి సమన్వయ పరుస్తారన్నారు. నల్లాన్ చక్రవర్తుల సాహిత్, డాక్టర్ కానుకొల్లు బాలకృష్ణ, డాక్టర్ ధూళిపాళ్ల రామకృష్ణ, మల్లాప్రగడ నందకిషోర్, పంతుల గాయత్రి, ఎన్‌సీహెచ్ బుచ్చయ్యా చార్యులు, పంతుల తపస్వి పృచ్ఛకులుగా పాల్గొంటారని చెప్పారు.

### యువతిని వేధిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): యువతిని పెళ్లి చేసుకోవాలని వేధిస్తున్న వ్యక్తిపై బుధవారం గుణదల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుణదల గాంధీజీ కాలనీకి చెందిన ఎస్. భవ్యశ్రీ పావని వన్‌టౌన్‌లో ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేస్తున్నారు. మంగళవారం రాత్రి 10 గంటలకు పని ముగించుకుని తిరిగి ఇంటికి వస్తుండగా తన ఇంటి సమీపంలో నివసించే మిల్కియా అనే వ్యక్తి ఆమెను వెంబడించి ఇంటి వరకు వచ్చాడు. తనను పెళ్లి చేసుకోవాలంటూ గొడవ పడ్డాడు. దీంతో అడ్డుకున్న భవ్యశ్రీ తల్లిని అసభ్యకరంగా దూషించాడు. భవ్యశ్రీ ఫిర్యాదు మేరకు బుధవారం గుణదల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### వార్డు వెల్ఫేర్ సెక్రటరీకి డాక్టరేట్



మహబూబ్ సుభానీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): 26వ డివిజన్ వార్డు వెల్ఫేర్ సెక్రటరీ డి.మహబూబ్ సుభానీ ఆచార్య నాగార్జున యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ప్రైవేట్ అండ్ కార్పొరేట్ స్కూల్ టీచర్స్ ఎదుర్కొంటున్న సమస్యలు – పరిష్కార మార్గాలు అనే అంశంపై చేసిన అధ్యయనానికి గానూ ఆయనకు డాక్టరేట్ లభించింది. గత నెల 30న యూనివర్సిటీలో డాక్టరేట్‌ను అందుకున్నారు. ఈ సందర్భంగా తోటి సచివాలయం సిబ్బంది, స్థానిక నాయకులు ఆయనను అభినందించారు.

### స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయం



పాయకాపురం(విజయవాడరూరల్): స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. స్పందన సేవా సమితి, స్పందన వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో గాంధీ జయంతిని పురస్కరించుకొని బుధవారం బీవీ సుబ్బారెడ్డి హైస్కూల్ నందు ఉచిత మెడికల్ క్యాంపు జరిగింది. ఠాగూర్ హాస్పిటల్ వారిచే రోగులకు ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు, మాక్సీ విజన్ వారిచే ఉచిత నేత్ర పరీక్షలు, ఆపిల్ ఇంటర్నేషనల్ వారిచే వినికిడి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 145 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి 50 మందికి కళ్లజోళ్లు అందజేశారు. కార్యక్రమంలో స్పందన సేవా సమితి అధ్యక్షుడు ఇమ్మానేని కృష్ణప్రసాద్, కార్యదర్శి డి.మురళీ, పలగాని భాగ్యలక్ష్మి, పర్చూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### బాబా మందిరంలో విశేష పూజలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో బుధవారం మహాలయ అమావాస్య పురస్కరించుకుని విశేష పూజలు, అభిషేకాలు జరిగాయి. మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీర మోహనరావు బాబాకు విశేషంగా పంచామృత అభిషేకం నిర్వహించి పారాయణం చేశారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

**13న 106వ మహాసమాధి పుణ్యతిథి మహోత్సవాలు**

ఈనెల 13వ తేదీ ఆదివారం శ్రీదత్తసాయి మందిరంలో 106వ మహాసమాధి పుణ్యతిథి మహోత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు వీరమోహనరావు తెలిపారు. ఆదివారం ఉదయం 7 గంటలకు బాబావారికి విశేషంగా 21 దివ్య ద్రవ్యాలతో అభిషేకం, అన్నాభిషేకం నిర్వహిస్తామన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి శ్రీసాయి అఖండనామ పారాయణం అన్నప్రసాద వితరణ జరుగుతుందని చెప్పారు. బాబావారు మహాసమాధి చెందిన సమయంలో భక్తులతో దీపాలంకరణ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. భక్తులు పాల్గొనాలని ఆయన కోరారు.

# గాంధీజీ చూపిన మార్గంలో నడవాలి

- మహాత్ముని త్యాగాలను స్మరించిన నాయకులు, అధికారులు
- వాడవాడలా ఘనంగా గాంధీజీ జయంతి



రామ్మోహన్ గ్రంథాలయంలో నివాళులర్పిస్తున్న అధికారులు, పాఠకులు



గాంధీజీ, శాస్త్రి చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే విష్ణు



గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా, నాయకులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): మహాత్మా గాంధీ చూపిన మార్గంలో నడవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రిల జయంతిని వాడవాడలా బుధవారం ఘనంగా నిర్వహించారు. మహనీయుల త్యాగాలను వక్తలు కొనియాడారు. గాంధీజీ, శాస్త్రిల జయంతి కార్యక్రమాన్ని సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. విష్ణు పాల్గొని ఆ మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలు జరిగాయి. ఎమ్మెల్సీ రూహుల్లా పాల్గొని గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు.

**మహాత్ముని ఆశయాలకు పాటుపడదాం..**

మహాత్మా గాంధీజీ ఆశయాల సాధన కోసం అందరూ పాటుపడాలని వాకర్స్ అసోసియేషన్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చిన్నం రామకృష్ణ అన్నారు. సింగ్‌నగర్ మాకినేని బసవ పున్నయ్య వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గాంధీజీ జయంతి వేడుకలు స్టేడియం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. అనంతరం తమ క్లబ్ 2026 ఎలక్ట్ గవర్నర్‌గా నియమితులైన కె.శ్రీనివాసరాజును సన్మానించారు. అనంతరం పలువురు జర్నలిస్టులకు బియ్యం, సరుకులు అందజేశారు. క్లబ్ డెప్యూటీ గవర్నర్ ఎన్‌బీజీఎం ప్రసాద్, సెక్రటరీ కాశీ ప్రసాద్, ట్రెజరర్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. పైపుల్ రోడ్ సెంటర్‌లో టీడీపీ నాయకులు పరుచూరి ప్రసాద్, పిరియా సోమేశ్వరరావు, దాసరి కనకారావులు పాల్గొని గాంధీజీ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం స్థానికులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ఎస్.దాసు, శ్రీను, మాధవ తదితరులు పాల్గొన్నారు.

**గ్రంథాలయాల్లో నివాళులు**

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాయలంలో జాతిపిత మహాత్మాగాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారి రమాదేవి గాంధీజీ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం చిత్ర లేఖనం పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు రమాదేవి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు. రామ్మోహన గ్రంథాలయంలో జాతిపతి మహాత్మా గాంధీ, భారత మాజీ ప్రధాని జై జవాన్ – జై కిసాన్ నినాద రూపకర్త లాల్ బహదూర్ శాస్త్రి జయంతి కార్యక్రమాలు జరిగాయి. గ్రంథాలయ అధ్యక్షుడు చింతలపూడి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో గాంధీజీ, శాస్త్రి చిత్రపటాలకు నివాళులర్పించారు. గ్రంథాలయ కార్యదర్శి వేములపల్లి కేశవరావు, ఉపాధ్యక్షులు దమ్మాల రామచంద్రరావు, చిగురుపాటి నరేష్, కోట కృష్ణభగవాన్, మద్దినేని పవన్, పావులూరి చిదంబరేశ్వరరావు ఙగ్రంథాలయ సిబ్బంది, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

**గాంధీజీ ఆశయ సాధనకు కృషి చేయాలి**

మధురానగర్(విజయవాడసెంట్రల్): గాంధీజీ ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని ప్రముఖ వైద్యుడు చల్లా హరికుమార్ అన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాలలో బుధవారం మాచవరం వాకర్స్‌క్లబ్ ఆధ్వర్యాన గాంధీజీ జయంతి వేడుకలు జరిగాయి. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వాకర్స్‌క్లబ్ నేతలు సుబ్బారావు తదితరులతో గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. మాచవరం వాణీ స్కూల్‌లో బుధవారం గాంధీజీ, లాల్ బహదూర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. మహనీయులు అందించిన సేవలు, వారి బాల్యంపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. గాంధీజీ స్ఫూర్తితో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పరిసరాలు శుభ్రం చేశారు. స్కూల్ డైరెక్టర్ అంజూరు శేషుబాబు, నాయకులు గాబ్రియేల్, దేవ్ తదితరులు పాల్గొన్నారు. మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం గాంధీజీ విగ్రహానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు డాక్టర్ డీఎస్‌వీఎస్ బాల సుబ్రహ్మణ్యం, డాక్టర్ డీ యుగంధర్, డాక్టర్ కె.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**గాంధీజీ చైతన్య ప్రేరణ ఉపయుక్తం**

పాయకాపురం(విజయవాడరూరల్): గాంధీజీ చైతన్య ప్రేరణ విద్యార్థులు ఉత్తమ పౌరులుగా ఎదగటానికి ఉపయుక్తమవుతుందని ప్రముఖ సామాజిక ఆధ్యాత్మికవేత్త, వాసవీ క్లబ్స్ ఇంటర్నేషనల్ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా తెలిపారు. రాజీవ్‌నగర్ వాసవీ భవన్ వద్ద గాంధీ, శాస్త్రి జయంతి కార్యక్రమం వైభవంగా జరిగింది. వివిధ క్లబ్‌ల నాయకులు, మాజీ గవర్నర్లు మాజేటి రామ చంద్రరావు, గణేష్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొని మహనీయుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హజరత్తయ్య గుప్తా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు.

**గాంధీజీని ఆదర్శంగా తీసుకోవాలి..**

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని చిత్తరంజన్ గ్రంథాలయంలో మహాత్మా గాంధీ జయంతి వేడుకలు బుధవారం నిర్వహించారు. గ్రంథాలయ అధికారి సంపత్ విద్యార్థులు, పాఠకులతో కలిసి గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు. విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**గాంధీ సిద్ధాంతాలను అలవర్చుకోవాలి**

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఖైదీలలో పరివర్తనకు మహాత్మాగాంధీజీ సిద్ధాంతాలను అలవర్చుకోవాలని మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఏ.సత్యానంద్ తెలిపారు. గాంధీనగర్‌లోని జిల్లా జైలులో గాంధీ జయంతి సందర్భంగా బుధవారం ఖైదీల సంక్షేమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన విజయవాడ మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఏ.సత్యానంద్, జడ్జి శ్రీదేవి, చీఫ్ జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ రాజశేఖర్, 6వ అదనపు మెట్రోపాలిటన్ జడ్జి జి.లెనిన్‌బాబు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మేజిస్ట్రేట్ సత్యానంద్ మాట్లాడుతూ.. సమాజంలో ప్రతి ఒక్కరూ మహాత్మాగాంధీ చూపిన మార్గంలో నడవాలన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే కోర్టు సెషన్స్ జడ్జి శ్రీదేవి మాట్లాడుతూ.. ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. అనంతరం జైలు ఆవరణలో మొక్కలు నాటారు. జైలులో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఖైదీలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జైలు పర్యవేక్షణాధికారి హంసపాల్, జైలర్ ఎస్.గణేష్, సీహెచ్ వేణు, డెప్యూటీ జైలర్స్ గోపయ్యనాయక్, జైలు సిబ్బంది పాల్గొన్నారు.



ఠాగూర్ గ్రంథాలయంలో నివాళులర్పిస్తున్న అధికారులు



వాణి స్కూల్‌లో పరిసరాలు శుభ్రం చేస్తున్న విద్యార్థులు



గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న హజరత్తయ్య గుప్తా, క్లబ్ సభ్యులు



చిత్తరంజన్ గ్రంథాలయంలో నివాళులర్పిస్తున్న అధికారులు, చిన్నారులు



డాక్టర్ చల్లా హరికుమార్, సుబ్బారావు ఆధ్వర్యంలో నివాళి

## నేటి నుంచి శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



మధురానగర్‌లో విద్యుత్ దీపాలు



జీవీఆర్‌నగర్‌లో సిద్ధమవుతున్న మండపం

మధురానగర్(విజయవాడసెంట్రల్): శ్రీదేవీశరన్నవరాత్రి ఉత్సవాలకు దేవాలయాలు సిద్ధమయ్యాయి. అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీపీఠం, రామలింగేశ్వరపేట శ్రీప్రసన్నాంజనేయస్వామివారి దేవాలయం, ముత్యాలంపాడు శ్రీ పార్వతీసమేత రామలింగేశ్వరస్వామివారి దేవాలయం, మధురానగర్ శ్రీ ఉభయ రామలింగేశ్వరస్వామివారి దేవాలయం, జీవీఆర్‌నగర్ దేవుని మండపం, దావు బుచ్చయ్యకాలనీ శ్రీ శ్యామలాంబదేవి అమ్మవారి దేవాలయం దసరా ఉత్సవాలకు ముస్తాబయ్యాయి. నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తిచేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మధురానగర్ మెయిన్ రోడ్డులో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు భారీ సెట్టింగ్ వేశారు. అయోధ్యగనర్ లో శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన మధురానగర్ మెయిన్ రోడ్డులో ఉత్సవ కమిటీ ఆధ్వర్యాన విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించి స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు.

## మహాత్మా.. మన్నించు !

**యథేచ్ఛగా మాంసం విక్రయాలు**



ఓ హోటల్ ముందు వేలాడదీసిన చికెన్

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రధాన పాత్రను పోషించిన పూజ్య బాపూజీ, మహాత్మా గాంధీజీ జయంతి సందర్భంగా యావత్ దేశమంతా అహింసాయుత జీవనాన్ని గడుపుతారు. అహింసావాదిగా పేరుగాంచిన గాంధీజీ పుట్టినరోజున ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ అహింసా దినోత్సవంగా ప్రకటించి పాటిస్తోంది. మన దేశంలో కూడా గాంధీ జయంతి రోజున మద్యం, మాంసం విక్రయాలు నిషేధిస్తూ ప్రభుత్వాలు ఆదేశాలు జారీ చేస్తాయి. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కూడా ఇదే విధంగా రెండు రోజుల క్రితం నగరంలోని మాంసం, మద్యం దుకాణదారులకు వాటిని విక్రయించడం నేరమని, అతిక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని ఆదేశించారు. అయితే నగరంలోని బిర్యానీ హోటళ్లు ఇవేవీ తమకు పట్టవన్నట్లుగా వ్యవహరించాయి. దొడ్డి దారిలో మాంసాన్ని తీసుకొని వచ్చి బహిరంగంగా, యథావిధిగా.. యథేచ్ఛగా తమ హోటళ్ల ముందు చికెన్ పార్ట్‌లను వేలాడుదీస్తూ వ్యాపారాలను జరుపుకున్నారు. ఏ ప్రభుత్వ అధికారి సైతం ఇటువైపు కన్నెత్తి చూడను లేదు.. ఇది తప్పని చెప్పి వారిని అడ్డుకున్నది లేదు. మాంసం దుకాణాలు లేకపోతేనేం మనకు చికెన్, మటన్, చేప, రొయ్య వంటి కోరిన బిర్యానీ లభిస్తుందని కొంతమంది నగరవాసులు వాటిని కొనుక్కొని వెళ్లారు. వాటిని చూసిన కొంతమంది చిన్నారులు ఇదేంటి ఈరోజు గాంధీతాత పుట్టినరోజు మాంసం విక్రయించారని, అహింసా దినోత్సవమని మా అమ్మానాన్నలు, టీచర్లు చెప్పారు. ఇక్కడ చూస్తే మామూలుగానే చికెన్, మటన్ బిర్యానీలు అమ్మేస్తున్నారేంటంటూ ఆశ్చర్యానికి గురయ్యారు. గాంధీ జయంతి రోజున జీవహింసకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని గాంధేయవాదులు కోరుతున్నారు.

## నిత్యావసరాల ధరల పెంపుతో బెంబేలు



మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నిత్యావసరాల ధరలను విపరీతంగా పెంచి పేదల నడ్డివిరుస్తోందని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మల్లాది విష్ణు బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. గడిచిన 4 నెలలలో నిత్యావసరాలు మొదలుకొని ఆహారధాన్యాలు, అన్ని రకాల వస్తుసేవల ధరలు ఆకాశాన్నంటి సామాన్యులకు చుక్కలు చూపిస్తున్నాయని మండిపడ్డారు. అవసరమైన పప్పు, బియ్యం, నూనె, ఉల్లి ధరలు కూడా అమాంతం పెరిగిపోయాయని.. ధరల పెరుగుదలతో సామాన్య, మధ్యతరగతి ప్రజల ఆర్థిక పరిస్థితి చిన్నాభిన్నం అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అకాల వర్షాలు, వరదలతో ఆర్థికంగా చతికిలపడ్డ ప్రజలు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారని.. కానీ ప్రభుత్వ చర్యలతో సామాన్యుడి జీవనం అగమ్యగోచరంగా మారిందని విచారం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన 100 రోజుల కాలంలో ఏ ఒక్క సంక్షేమ పథకం అమలుకాకపోగా.. ధరల బాదుడు పథకం మాత్రం దిగ్విజయంగా అమలవుతోందని మల్లాది విష్ణు ఎద్దేవా చేశారు. జూలై 2న నిత్యావసరాల ధరల పెరుగుదలపై వ్యవసాయశాఖ, మార్కెటింగ్, పౌరసరఫరాల అధికారులతో సమీక్ష నిర్వహించిన సీఎం చంద్రబాబు.. ఏం సాధించారని ప్రశ్నించారు. ఎన్నికల ప్రచార సభలో పవన్ కళ్యాణ్, పురందేశ్వరితో కలిసి ఒకే వేదికపై చంద్రబాబు మాట్లాడుతూ.. నిత్యావసరాలు ధరలు తగ్గిస్తామంటూ ఆనాడు బాబు మాట్లాడిన మాటలు ఏమయ్యాయని మల్లాది విష్ణు ప్రశ్నించారు. ధరలు తగ్గించకుంటే సామాన్యుడి ఆగ్రహ జ్వాలలకు ఈ ప్రభుత్వం గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు.

## వరద బాధితులకు చేయూత



దుస్తులు, సరుకులు పంపిణీ చేస్తున్న హెచ్‌ఎం హుస్సేన్ తదితరులు



వరద బాధితులకు సాయం అందజేస్తున్న క్రీస్తు సంఘం సభ్యులు

పాయకాపురం(విజయవాడరూరల్): తల్లిదండ్రులు లేని పేద విద్యార్థులను ఆదుకునే ఉద్దేశంతో బుధవారం పుచ్చలపల్లి సుందరయ్య స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న 20 మంది విద్యార్థులకు ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ మైనం హుస్సేన్ దుస్తులు, నిత్యావసర సరుకులు అందచేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం పేద విద్యార్థులను గుర్తించి వారికి అవసరమైన సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. వృద్ధ మహిళలకు చీరలు, నిత్యావసర సరుకులు అందజేశామని చెప్పారు. అనంతరం గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాంధీజీ జయంతిని పురస్కరించుకొని జరిగిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**సరుకులు, నగదు అందజేత**

మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద బాధితులకు రాజమండ్రి రామదాసుపేట క్రీస్తు సంఘం ఆధ్వర్యాన ఉందుర్తి రాజావిజయ్‌కుమార్ సహకారంతో బుధవారం 100 కుటుంబాలకు నిత్యావసర సరుకులు, రూ. 500 నగదు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాస్టర్ దేవరపల్లి అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. వరదతో సర్వం కోల్పోయిన 100 కుటుంబాలకు రూ.1500 విలువ చేసే నిత్యావసర సరుకులతో పాటు 500 నగదు అందజేస్తున్నామని తెలిపారు. ఇప్పటికే తాము పలు ప్రాంతాలలో నిత్యావసర సరుకులు ఆహార పొట్లాలు, తాగునీరు పంపిణీ చేశామన్నారు. అనంతరం రామకృష్ణాపురం, అజిత్‌సింగ్‌నగర్, రాధానగర్ తదితర ప్రాంతాల్లో నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో క్రీస్తు సంఘం సభ్యులు పిల్లల స్వామి, జి.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**వరద బాధితులకు చీరల పంపిణీ**

మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద బాధితులకు బుధవారం సాయంత్రం బీఆర్టీఎస్ రోడ్డులో మాజీ కార్పొరేటర్ కాకుమల్లిఖార్జున యాదవ్ ఆధ్వర్యాన 500 మందికి చీరలు పంపిణీ చేశారు. చీరాల బీఆర్కే స్కూల్స్ అధినేత రాధాకృష్ణ రెడ్డి మిత్రబృందం సహకారంతో చీరలు అందజేశారు.


## నగరంలో ఉరుములు, మెరుపులతో భారీ వర్షం



పటమటలో నిలిచిన వర్షపు నీరు

మధురానగర్/అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నగరంలో బుధవారం సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. అప్పటి వరకు భానుడి ప్రతాపంతో అల్లాడిన నగర వాసులు వర్షంతో ఉపశమనం పొందారు. బుడమేరు వరద ముంపు జరిగి నెలరోజులు గడిచినా.. నగరంలోని పలు ప్రాంతాల్లో వరద ఆనవాలు కనిపిస్తూనే ఉన్నాయి. వాటిని ఇప్పుడిప్పుడే మరచిపోదామనుకుంటున్న వరద బాధితులను అకాలంగా వస్తున్న వర్షాలు వణుకుపుట్టిస్తున్నాయి. బుధవారం కురిసిన వర్షంతో నగరంలోని ప్రధాన రహదారులు నీటమునిగాయి. నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## దసరా ఉత్సవాలకు వేళాయె



ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలకు సర్వం సిద్ధమైంది. గురువారం నుంచి ప్రారంభంకానున్న ఉత్సవాలకు ఆలయ ప్రాంగణాన్ని శోభాయమానంగా తీర్చిదిద్దారు. విద్యుత్ దీపాలు, వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. దీంతో నగరంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







## రేపటి నుంచి చెస్ ఉచిత శిక్షణ తరగతులు

విజయవాడస్పోర్ట్స్: దసరా సెలవులను పురస్కరించుకుని చెస్ ఉచిత శిక్షణ తరగతులను ఈ నెల నాలుగు నుంచి తొమ్మిదో తేదీ వరకు పటమట ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు గ్లోబల్ చెస్ అకాడమీ నిర్వాహకులు, అంతర్జాతీయ చెస్ కోచ్ షేక్ ఖాసిం తెలిపారు. ఆయా రోజుల్లో ఉదయం 8.30 నుంచి 10.30 వరకు, సాయంత్రం 5.30 నుంచి ఏడు గంటల వరకు తరగతులు ఉంటాయన్నారు. ఏడు నుంచి 15 ఏళ్ల లోపు విద్యార్థులకు మాత్రమే శిక్షణ ఇస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముందస్తుగా పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు 98495 14138 ను సంప్రదించాలని కోరారు.